క్లుప్తంగా

నేడు ఆధార్ శిబిరాలు

నెల్లూరు రూరల్ : నెల్లూరు డివిజన్ పరిధిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన పలుచోట్ల ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. బిట్రగుంటలోని ఐబీబీ బ్యాంక్ దగ్గర మీసేవ కేంద్రం, కొడవలూరు సచివాలయం, కోవూరు సచివాలయం, స్టోన్‌హౌస్‌పేటలో నిర్వహిస్తారని తెలియజేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, కొత్త ఆధార్, ఫోన్ నంబర్ అప్‌డేట్ చేసుకోవచ్చని వివరించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

నెల్లూరు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలోని సుమారు 10 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్, జిల్లా కార్యదర్శి ఓవీ ప్రసాద్ కోరారు. నగరంలోని ఆర్టీసీ ప్రాంగణంలో ఉన్న యూనియన్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేయింబవళ్లు పనిచేసే ఆర్టీసీ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తగవన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ పదోన్నతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యం రాజు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు ఎండీ ప్రసాద్, జి.నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శులు ఇ.రమేష్‌కుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయండి

- ఎస్పీకి ఏపీటిడ్కో చైర్మన్ వినతి

నెల్లూరు(క్రైమ్) : అల్లీపురంలోని టిడ్కో ఇళ్ల వద్ద పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని ఏపీ టిడ్కో కార్పొరేషన్ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఎస్పీని కోరారు. ఈమేరకు ఆయన బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందన్నారు. చోరీలు, అల్లర్లు, ఆకతాయిల వేధింపులు అధికమవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో అనేక ఇళ్లు నేటికీ ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తే శాంతి భద్రతలు గాడిలో పడే అవకాశం ఉందన్నారు. ఎస్పీని కలిసిన వారిలో టిడ్కో ప్రాజెక్ట్ అధికారి ఉమాశంకర్‌శాస్త్రి తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నెల్లూరు రూరల్ : నగరంలోని బీవీనగర్, కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిని పార్టీ ఏపీ సభ్యత్వ సహ ఇన్‌చార్జి కృష్ణదాస్ పర్యవేక్షించారు. సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేష్, పార్టీ నేతలు గుంజీ శ్రీనివాసులు, అశోక్ నాయుడు, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆయుష్షు

- వాకింగ్‌పై ఇప్పుడిప్పుడే పెరుగుతున్న ఆసక్తి
- నగరంలో ఉదయం, సాయంత్రం కోలాహలం


వాకింగ్ చేస్తూ..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రస్తుత యాంత్రిక జీవన విధానం పుణ్యమానని ఎక్కువ మందిలో శారీరక శ్రమ కరువవుతోంది. పని ఒత్తిడి.. ఆహార అలవాట్లలో మార్పులు.. వెరసి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వాకింగ్ చేయాలనే ఆసక్తి ఉన్నా, ఎంతో మందికి సమయం కుదరడంలేదు. ఇదే విషయాన్ని వైద్యులు సూచిస్తున్నా, పెద్ద ప్రయోజనం ఉండటంలేదు. అయితే నడక ప్రాధాన్యంపై వివిధ వాకర్స్ అసోసియేషన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తుండటంతో ఇప్పుడిప్పుడే పలువురు ఆసక్తి చూపడాన్ని ప్రారంభిస్తున్నారు.

నిత్యం కోలాహలం

వాకర్స్‌తో మైదానాలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్లపై ఉదయం, సాయంత్రం వేళ కోలాహలం నెలకొంటోంది. నగరంలోని బీవీఎస్, ఆరెస్సార్ మున్సిపల్, సెయింట్ పీటర్స్, వీఆర్సీ, దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూళ్ల మైదానాలు, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్, స్వర్ణాల చెరువు, నెక్లెస్ రోడ్లలో వాకింగ్ చేసేందుకు నిత్యం ఎంతో మంది వస్తున్నారు. గతంలో మైదానాల్లోనే స్పోర్ట్స్, గేమ్స్ కనిపించేవి. అయితే ఇప్పుడు క్రీడాకారుల స్థాయికి మించి వాకర్స్ కనిపిస్తున్నారు.

రోజూ దాదాపు 60 వేల మంది..

నగరంలోని 30 పార్కులతో పాటు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ కోలాహలం కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కలిపి ఉదయం సుమారు 32 వేల మంది, సాయంత్రం దాదాపు 28 వేల మంది వాకింగ్ చేస్తున్నారని అంచనా.

మెరుగైన అలవాట్లు


ఉదయం, సాయంత్రం వేళ వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన అలవాట్లు వస్తాయి. ఉదయాన్నే నిద్ర లేవడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించొచ్చు. స్వచ్ఛమైన గాల్లో నడిస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. శరీరానికి కావాల్సిన రక్త ప్రసరణ లభిస్తుంది. నూతన పరిచయాలు ఏర్పడతాయి. : **దేవా, వాకర్**

ఆరోగ్యానికి వాకింగే ముఖ్యం


ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి. ఒక వేళ అది కుదరకపోతే రోజూ క్రమం తప్పక నడవాలి. ఆరోగ్యంగా ఉండేందుకు నడక ఎంతో దోహదపడుతుంది. పిల్లలతో పాటు చుట్టుపక్కల వారితో రోజూ వాకింగ్ చేయిస్తున్నాం. దీంతో పిల్లలు ఎంతో చురుగ్గా ఉంటున్నారు.
: హుస్నారా, ఫిజికల్ డైరెక్టర్

చిన్ననాటి నుంచే అలవాటు చేయాలి


ప్రస్తుతం ఎక్కువ మంది ఫోన్లకు అలవాటు పడిపోయారు. దీంతో కంటి చూపు దెబ్బతినడమే కాకుండా మానసిక పరిస్థితి సక్రమంగా లేకుండాపోతుంది. ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. వ్యాయామంతో మానసిక స్థితితో పాటు శారీరక దృఢత్వం వస్తుంది. చిన్నతనం నుంచే మైదానాలకు వెళ్లేలా పిల్లలను ప్రోత్సహించాలి.
: షాబికా, ఫిజికల్ డైరెక్టర్

ఆహార అలవాట్లు ముఖ్యం


వాకింగ్ చేసేవారు ఆహార అలవాట్లపై జాగ్రత్తలు తీసుకోవాలి. పొడవు, బరువుకు తగిన విధంగా నడకను సాగించాలి. వాకింగ్ చేస్తున్న వారి శరీరతత్వాన్ని బట్టి ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా నడవడం, మితిమీరిన ఆహారం తీసుకోవడం ద్వారా ప్రయోజనం ఉంటుందని భావించడం అపోహ. ఎంత నడవాలో, ఎంత వ్యాయామం చేయాలో అవగాహన చేసుకోవాలి.
: దివ్య, డాక్టర్, జీజీహెచ్

కనులపండువగా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ చేసిన భక్తులు పవిత్ర పినాకినీ నదీ జల కలశాలతో నగరోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. సంతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయం నుంచి పవిత్ర జలంతో వందలాది మంది భక్తులు అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో నగరోత్సవంగా బయల్దేరారు. అనంతరం రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. ఇరుముడులను సమర్పించి, కలశాల్లోని పవిత్ర జలంతో అమ్మవారిని అభిషేకించనున్నారు. ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన

నెల్లూరు సిటీ : వరి పంటకు ఆశించే చీడపీడలు, తెగుళ్లపై అవగాహన అవసరమని, అప్పుడే వాటిని నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి(ఏఓ) నాగమోహన్ అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని ములుముడి, కందమూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమోహన్ మాట్లాడుతూ పీఎం కిసాన్ 18వ విడత నగదు జమ కాని రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అనూష, రమేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు చేస్తే ప్రశ్నించొచ్చు

నెల్లూరు(సెంట్రల్) : రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ఎలాంటి తప్పులు చేసినా ప్రశ్నించవచ్చని, అయితే పనిగట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదని డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరులోని బృందావనం గార్డెన్స్‌లో ఆయన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మద్యం సిండికెట్ల విషయంలో మంత్రి జోక్యం ఎక్కడా లేదన్నారు. కాగా పార్టీ నాయకుల కోసం, కార్యకర్తల కోసం ఆయన ఎంతవరకైనా పోరాడుతారన్నారు. మద్యం షాపుల విషయంలో మామూళ్లను వసూలు చేసే సంస్కృతి మాది కాదని, ఇలాంటి వాటిని నారాయణ ప్రోత్సహించరన్నారు.

ముత్తుకూరు పొదుపు సభ్యులతో సమావేశం


పొదుపు మహిళకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో ముత్తుకూరు గ్రామంలోని 49 స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులతో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సంఘ నిర్వహణ, ప్రధాన ఉద్దేశాలు, ఆశయాలు, సభ్యత్వం, సమావేశాలు, ఎన్నికలు, ఆడిటింగ్, వివాదాల పరిష్కారాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప మాట్లాడుతూ, పొదుపు సహకార సంఘాలను చట్టబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు తప్పక పాటించాలని తెలియజేశారు. అనంతరం సంఘ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిబంధనల పుస్తకాలను బృందాల సభ్యులకు అందజేశారు.


బీజేపీవైపే బడుగులు


మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : హర్యాణాలో బడుగు, బలహీన వర్గాలు బీజేపీ వైపు ఉన్నారని ఆ పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ గెలుపు కాంగ్రెస్‌కు గుణపాఠమని చెప్పారు. హర్యాణా చరిత్రలో హ్యాట్రిక్ గెలుపు బీజేపీకే సాధ్యపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గిరికుమార్‌గౌడ్, కార్యదర్శి సాయిశ్రీనివాస్, సీనియర్ నేత జగన్ పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..


సరస్వతీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు(బృందావనం): సింహపురిలో శరన్నవరాత్రి శోభ నెలకొంది. విశేషాలంకారాల్లో దర్శనమిస్తున్న జగజ్జననిని దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆలయాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.

- రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మధుసూదన్‌రెడ్డి, రజని, శివనారాయణ, శిరీష, శ్రీధర్‌రెడ్డి, శ్రీకళ దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా డాక్టర్ రఘురాజసింహ, హిమజ వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. మూలవర్లను పుస్తకాలు, పెన్నులతో అలంకరించారు. ఉభయకర్తలుగా మునగా వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మీకుమారి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ప్రసాద్‌నాయుడు, మైథిలీ, విజయభాస్కర్‌రెడ్డి, అరవింద, శ్రీహరి, వెంకటసుదర్శనమ్మ వ్యవహరించారు.
- కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వంశీకృష్ణ, సాయిమణిహారిక, వెంకటప్రసాద్‌రావు, మాధవీలత, రమణయ్య, శేషమ్మ, రమేష్‌బాబు, సుప్రజ దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు మహాసరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా హేమచంద్రారెడ్డి, గ్రీష్మ, పుండరీకాక్షం, లీలామోహన్, లక్ష్మి వ్యవహరించారు.
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటసత్యనారాయణ, వెంకటసుభాషిణి, ద్వారకానాథ్, సాయికుమారి దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో గల వైభవ లక్ష్మి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా విజయశ్రీనివాస్, ప్రసన్న, రామసుబ్బు, వాసుకి, కనకరాజు, శరణ్య, సుధాకర్, సరోజనమ్మ, శివకుమార్‌రెడ్డి, దీప, నిఖిల్, జీవిత దంపతులు వ్యవహంచారు.
- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.
- నవాబుపేటలోని కామిశెట్టి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పంచాగ్నుల పవన్‌కుమార్, సోదరులు వ్యవహరించారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి, వసంత, భవ్య, సత్యనారాయణ, రుక్మిణి, శ్యామ్‌సుందర్‌ప్రభు, లలిత, వెంకటమోహన్‌రెడ్డి, కవిత దంపతులు వ్యవహరించారు.
- సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాజశేఖర్‌రెడ్డి, పెంచలమ్మ వ్యవహరించారు.
- సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా గాదిరాజు శాంతమ్మ వ్యవహరించారు.


కామిశెట్టివారి మహాలక్ష్మి ఆలయంలో..


వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..


కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..


ధర్మరాజస్వామి దేవస్థానంలో..

- మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమాజ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య పాల్గొన్నారు.
- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కిరణ్‌కుమార్, లలితారాణి వ్యవహరించారు.
- నవాబుపేటలోని కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బత్తిన గౌతమ్‌రెడ్డి, శరణ్య వ్యవహరించారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఈఓ వేమూరి గోపీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం సరస్వతీ అమ్మవారి వద్ద ఉంచిన పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. సుధాకర్ నిర్వహించిన భక్తి సంకీర్తన విభావరి అలరించింది. ఉభయకర్తగా శ్రీనివాసులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దొరసాల నాగిరెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ పాల్గొన్నారు.


సీతారామస్వామి మందిరంలో..

జంపింగ్ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ జెండాతో గెలిచి, ప్రస్తుతం పార్టీ మారుతున్న ప్రజాప్రతినిధులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో తాను పార్టీ నుంచి వెళ్లిన కార్పొరేటర్లను కొడతా అని అన్నానంటూ నాపై దుష్ప్రచారం చేయడం తగదని, నేను అలా మాట్లాడలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జెండాతో ప్రజల్లో పలుకుబడి సంపాదించి ప్రస్తుతం పార్టీని వీడే వారు తొలుత ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డివిజన్ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నామనేది అబద్ధమని, స్వప్రయోజనాల కోసమే పార్టీ మారుతున్నామని చెబితే సంతోషిస్తామన్నారు. అలాంటి వారిని ప్రజలే ఛీదరించుకుంటారన్నారు. పార్టీ మారి వెళ్లినంత మాత్రాన భవిష్యత్తులో మీకు అక్కడ టికెట్ వస్తుందని గ్యారంటీ ఉందా అని ప్రశ్నించారు. పార్టీ మారిన కార్పొరేటర్లు తమ పదవులకు రాజీనామా చేసి టీడీపీ తరఫున పోటీ చేసి గెలవాలన్నారు. కొంత మంది పార్టీ పదవులు అనుభవిస్తూ వైఎస్సార్‌సీపీని తిట్టడం సిగ్గుచేటన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, ఉన్న వారితోనే పార్టీని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సత్తార్, పార్టీ నేతలు హంసకుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురావు(ఆర్‌ఎస్ఆర్), మనోహర్‌రెడ్డి, ఆదిరెడ్డి, నవాబ్‌జాన్, అస్లాం, చంద్రారెడ్డి, శ్యామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో నూతన విధానాలు తగదు


బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఓఐ నాయకులు

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసీలో ఇటు ఏజెంట్లకు, అటు ప్రజలకు నష్టం చేకూర్చే నూతన విధానాలు ప్రవేశపెట్టడాన్ని తక్షణమే యాజమాన్యం ఉపసంహరించుకోవాలని ఏఓఐ (ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని బృందావనంలో ఉన్న ఎల్‌ఐసీ సిటీ బ్రాంచ్–2 సీనియర్ మేనేజర్ జనార్దన్‌కు బుధవారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ఏఓఐ కార్యదర్శి హజరత్‌రెడ్డి మాట్లాడుతూ ఐఆర్‌డీఏ సూచనలతో ఎల్‌ఐసీలో ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం దారుణమన్నారు. అలాగే ప్రజలు పాలసీలు తీసుకుని చెల్లించే ప్రీమియంను పెంచడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయం దేశంలోని సుమారు 15 లక్షల మంది ఏజెంట్లపై ప్రభావం పడుతుందన్నారు. కనీస పాలసీ రూ.2 లక్షల సమ్ అస్యూర్డ్ నుంచి తీసుకోవాలనే నిబంధన పెట్టడం నిరుపేదలకు ఇబ్బంది అన్నారు. అందువల్ల తక్షణమే యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓఐ జోనల్ నాయకులు మేకల నరసింహారావు, వెంకటేశ్వర్లు, నరసింహులు, విజయభాస్కర్‌రెడ్డి, నర్సయ్య, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఆరాధన మహోత్సవాలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అర్చకులు, సభ్యులు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు సాయిబాబా 106వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలను నిర్వహించనున్నట్లు మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు. అద్దాల మందిరానికి అనుబంధంగా ఉన్న ద్వారకామాయిలో ఈ మేరకు ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసాయి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 7 గంటలకు సాయిబాబా భిక్షాటన కార్యక్రమాన్ని పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసీనగర్, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించనున్నామన్నారు. శని, ఆదివారం కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు, సాయినామ సంకీర్తనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మీసాయి, సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

'నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు'


- డయల్ యువర్ డీఎం–2లో ప్రయాణికుల ఫిర్యాదులు

నెల్లూరు సిటీ : నెల్లూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఓ డ్రైవర్, కండక్టర్ దురుసుగా ప్రవర్తించాడని, స్టాపింగ్‌లో డ్రైవర్ బస్సు నిలపకుండా వెళ్లిపోతున్నారని, తమతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం –2 కార్యక్రమంలో ప్రయాణికులు తమ బాధను వ్యక్తపరిచారు. నగరంలోని డిపో–2 కార్యాలయంలో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు తమ సమస్యలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఫత్తేఖాన్‌పేటకు చెందిన వెంకటయ్య మాట్లాడుతూ నెల్లూరు నుంచి రాజంపేట వెళ్తున్న హయర్ బస్ కండక్టర్‌లు చాలా దురుసుగా, వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. తోటపల్లిగూడూరుకు చెందని జిలానీబాషా మాట్లాడుతూ తాను అంధుడని, కొత్తపాళెం రూట్ తిరిగే బస్సు డ్రైవర్‌లు కనీసం బస్సు ఎక్కేలోపు నిలపకుండా వెళ్లిపోతున్నారని తెలిపారు. విడవలూరుకు చెందిన ప్రసూన మాట్లాడుతూ బెంగళూరు సర్వీసులను బెల్లందూరు మీదుగా ఎలక్ట్రానిక్ సిటీ వరకు నడపాలని కోరారు. ఈ సందర్భంగా శివకేశవ్ యాదవ్ మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు(అర్బన్) : అధికార పార్టీ ఒత్తిళ్లతో అక్రమంగా తొలగించిన రావులకొల్లు ఆశా వర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు అన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కలిగిరి మండలం రావులకొల్లు గ్రామంలో గత 18 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు, ఆరోపణలు లేకుండా ఆశావర్కర్‌గా విజయమ్మ పని చేస్తున్నారన్నారు. అలాంటి మహిళను గ్రామ సర్పంచ్ ఒత్తిళ్లకు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తొలగించడం దారుణమన్నారు. ఈ దీక్షలకు సంఘీభావంగా శ్రామిక మహిళా సంఘం నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సీఐటీయూ నాయకులు అల్లాడి గోపాల్, కె.పెంచలనరసయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

పురసేవలపై తిరువనంతపురంలో అధ్యయనం



పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : దేశంలోని ఇతర రాష్ట్రాల్లో సమర్థవంతంగా నిర్వహిస్తున్న పురపాలక సేవలను అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బృందంలో నెల్లూరు కమిషనర్ సూర్యతేజ కూడా ఉన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందితో పాటు చెత్త, వ్యర్థాల సేకరణ, తరలింపు, వేరుచేయుట, కంపోస్ట్ యార్డ్ నిర్వహణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రెయిన్, మరుగుదొడ్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు, పౌరసేవల నిర్వహణ, పన్నుల వసూళ్ల విధానాలను అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

పరమేశ్వరికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలను తెస్తున్న శ్రీధర్‌రెడ్డి దంపతులు

నెల్లూరు(బృందావనం) : సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మందుల పంపిణీ

నెల్లూరు సిటీ : నగరంలోని సంతపేట కామాక్షినగర్‌లో ఉంటున్న వ్యక్తి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తుడికి మందులను బుధవారం అందజేశారు. కోగిలి రమేష్‌రాజు, ముని వెంకటసూర్య, యశ్వంత్, బాలాజీ, వెంకటరమణ పాల్గొన్నారు.